



ఓఆర్‌ఆర్ ఆమోదం.. బైపాస్ రద్దు



పేటలో సిండికేట్లు

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

- బార్లు.. వైన్స్ వ్యాపారుల సిండికేట్
- చిలకలూరిపేటలో గంట ముందే వైన్స్ మూత
- బార్లలో బాటిల్‌కు రూ.50 అదనంగా వసూలు
- అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్న వ్యాపారులు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్, పోలీసు అధికారులు

వ్యాపారం.. అంటే ఎక్కడైనా పోటీ ఉంటుంది. కానీ చిలకలూరిపేటలో మద్యం వ్యాపారులు కలిసికట్టుగా వ్యాపారం చేసుకుంటూ మందుబాబులను దోచుకుంటున్నారు.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వీరికి అధికార పార్టీ నేతల అండగా ఉంటుండగా.. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. సాధారణంగా ఎక్కడైనా వైన్స్‌ల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ సమయం మద్యం విక్రయాలు చేస్తుంటారు. కానీ చిలకలూరిపేటలో ఇందుకు భిన్నంగా నిర్ణీత సమయం కన్నా ముందుగానే మూసివేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చిలకలూరిపేటలో పరిస్థితి నెలకొంది. చిలకలూరిపేటలో మొత్తం 11 బార్లు, 6 వైన్సు ఉండగా 9 బార్లు 6 వైన్ షాపుల వారు సిండికేట్ అయ్యారు. వీరంతా కలిసి ఒకవైపు మందుబాబులను దోచుకుంటూ మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటలకు వైన్ షాపులు మూసివేయాలి. అయితే రాత్రి 9 గంటలకే ఇక్కడ వైన్ షాపులను మూసివేస్తున్నారు. మందుబాబులకు రాత్రి 9 గంటల నుంచి మద్యం దొరకకుండా చేస్తున్నారు. దీంతో తప్పనిసరిగా మందుబాబులు బార్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇక ఇక్కడ అదనపు ధర పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని సృష్టించారు. ఎమ్మెల్సీ ఎన్నికల రోజున, ఓట్ల లెక్కింపు రోజున, కోటప్పకొండ తిరునాళ్ల రోజున వైన్ షాపులకు ముందువైపున తాళాలు, సీళ్లు వేసినవి వేసినట్టే ఉన్నా వెనుక నుంచి అధిక ధరలకు భారీగా మద్యం అమ్మకాలు జరిగాయి. దాదాపు అన్ని వైన్ షాపులకు సమీపంలో బార్లలో కూర్చుని తాగేలా మందుబాబులకు టేబుళ్లు, కుర్చీలు కూడా ఏర్పాట్లు చేశారు. నిబంధనలను అతిక్రమించి బార్లు, వైన్ షాపుల నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారు.

నెల రోజులుగా తగ్గిన ఇండెంట్

బార్ల నిర్వాహకులు నరసరావుపేటలోని ఎక్సైజ్ డిపో నుంచి మద్యం కొనుగోలు చేస్తారు. నెల రోజులుగా డిపో నుంచి కొనుగోలు చేసే సరుకు సగానికి సగం తగ్గించారు. బార్ల వ్యాపారులు నిత్యం 50 శాతం సరుకు కొనుగోలు ఇండెంట్ మాత్రమే పెడుతున్నారు. మిగతా సగం సరుకును వైన్‌షాపుల నుంచి సేకరిస్తున్నారు. ఈ సరుకుపై క్వార్టర్ బాటిల్‌కు రూ.50 చొప్పున ధర పెంచి బార్లలో విక్రయిస్తున్నారు. వచ్చే లాభాన్ని బార్లు, వైన్ షాపులవారు కలిసి పంచుకుంటున్నారు. గత నెల రోజులుగా బార్లు, వైన్స్ వ్యాపారుల ఇండెంట్లను ఉన్నతాధికారులు పరిశీలిస్తే ప్రభుత్వానికి ఎంత మేర ఆదాయానికి గండిపడిందో తెలుస్తుంది.

మామూళ్లే.. మామూళ్లు..

పట్టణంలోని ఒక్కో బారు నుంచి నెలకు రూ.20వేలు చొప్పున, వైన్ షాప్ నుంచి నెలకు రూ.25 వేల చొప్పున పోలీసు, ఎక్సైజ్ శాఖల వారికి మామూళ్లు వెళుతున్నాయని సమాచారం. సిండికేటైన వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేసుకుంటున్నా ఎక్సైజ్‌శాఖ ఏమీ తెలియనట్లుగా మత్తులో జోగుతోంది. అప్పుడప్పుడు తనిఖీలకు ఎక్సైజ్ స్క్వాడ్లు వస్తున్నా ఆ సమాచారం ముందుగానే మద్యం దుకాణాల వారికి తెలుస్తున్నది. వారి రాకపోకలను తెలుసుకునే సిగ్నలింగ్ వ్యవస్థ ఇక్కడ ఉంది. వారికి కూడా ఎంతో కొంత ముట్ట చెప్పి కేసులు రాయకుండా పంపిస్తున్నారంటే సిండికేట్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఇక రాజకీయాలు ఎన్నికల వరకే అని చిలకలూరిపేటలో టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నేతలు నిరూపించారు. మద్యం వ్యాపారం అన్ని పార్టీల శ్రేణులు కలిసి చేసుకుంటున్నాయి. వైసీపీ వారితో టీడీపీ నేతలు చెట్టాపట్టాల్ వేసుకుని వ్యాపారం నిర్వహిస్తుండటాన్ని ఆయా పార్టీల కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు.

నరసరావుపేటలో బెడిసికొట్టిన వ్యూహం

చిలకలూరిపేట తరహాలోనే నరసరావుపేటలో కూడా మద్యం వ్యాపారులను సిండికేట్ చేసేందుకుకు టీడీపీ ముఖ్య నేత ప్రయత్నించారు. అయితే పల్నాడు రోడ్డులోని ఓ వైన్స్ నిర్వహకులు సిండికేట్‌కు అంగీకరించలేదు. దీంతో ఆయన ప్రయత్నం బెడిసికొట్టింది. పట్టణంలో 18 బార్లలో 14 వైసీపీ నేతల నిర్వహణలో ఉన్నాయి. వైన్స్‌లు టీడీపీ నేతల ఆధీనంలో ఉన్నాయి. టీడీపీ.. వైసీపీ వ్యాపారులను ఒకటిగా చేసి మద్యం అధిక ధరలకు విక్రయించేలా చేసేందుకు సదరు నేత ప్రయత్నించగా అది విఫలమైనట్లు పార్టీ వర్గాలే ప్రచారం చేస్తున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.24 (గురువారం సాయంత్రం)
సహరి : 4.55 (శుక్రవారం ఉదయం)

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి, గుంటూరు, విజయవాడను అనుసంధానించే అత్యంత కీలకమైన రహదారుల నిర్మాణంపై తాజా పరిణామాలు ప్రజల్లో నిరాశను కల్పిస్తున్నాయి. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మంజూరైన సంతోషం మిగలకుండా, అప్పటికే మంజూరైన విజయవాడ తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం రెండు జిల్లాల ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. రాజధానికి అనుబంధంగా ఉన్న ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల రవాణా అవసరాల్లో అత్యంత కీలకమైన ఈ బైపాస్ రద్దుతో ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు, విజయవాడ నగరాల మీదగా వెళ్లే అత్యంత కీలకమైన చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16 ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారింది. ఈ రహదారి విజయవాడ బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగు, రామవరప్పాడు గుండా వెళుతుంది. ఈ నాలుగు చోట్ల గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడకు తూర్పు, పశ్చిమలుగా రెండు బైపాస్‌లు నిర్మించాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో పశ్చిమ బైపాస్ నిర్మాణం ఒక కొలిక్కివచ్చింది. ఇక తూర్పు బైపాస్ పనులు జరగాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం దాని అవసరం లేదని తేల్చింది.

కీలకమైన రహదారి..


రాజధాని అమరావతి అభివృద్ధిలో రహదారుల కనెక్టివిటీ, పోర్టుల అనుసంధానం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో విజయవాడ తూర్పు బైపాస్ ఎంతో కీలకమైనది. గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు, ప్రధానంగా తీర ప్రాంత ప్రజలను ఎయిర్‌పోర్టుకు అనుసంధానించడంలో ఇదే అత్యంత కీలకమైన రోడ్డుగా భావించారు. ఓఆర్‌ఆర్ అందుబాటులోకి వచ్చే వరకూ బందరు సీ పోర్టు నుంచి ఎయిర్‌పోర్టును అనుసంధానం చేయడంలో కూడా ఈ రహదారి కీలకమైనది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు, తూర్పు రాయలసీమ ప్రాంతాల్లోని ప్రజలకు ట్రాఫిక్ లేని రవాణాను అందుబాటులోకి తేవడంలో ఈ బైపాస్ కీలకమైనది. ఈ పరిస్థితుల్లో కిందటేడాది సెప్టెంబరు నెలాఖరున కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదముద్ర వేశారు. ఎన్టీఆర్ జిల్లా పొట్టిపాడు టోల్ ప్లాజా నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు రూ.50 కి.మీ మేర ఈ రహదారిని నిర్మించేందుకు ఆమోదం తెలిపి రూ.2,176 కోట్లు కేటాయించారు.

అలైన్‌మెంటు మార్చితే పోయేదానికి..

ఓఆర్‌ఆర్, ఈస్ట్ బైపాస్‌ల నిర్మాణం ఒకదానికి ఒకటి దగ్గరగా ఉంటున్నాయన్న కారణం చూపి కేంద్రం ఈస్ట్ బైపాస్‌ను రద్దు చేసింది. వాస్తవానికి ఈస్ట్ బైపాస్ నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ 3 అలైన్‌మెంట్లను సూచించింది. ఆప్షన్ 1 కింద విజయవాడకు సమీపంగా 41.230 కి.మీ, ఆప్షన్ 2 కింద మరికొంచెం దూరంలో 44.185 కి.మీ, ఆప్షన్-3 కింద విజయవాడకు దూరంగా 45.595 కి.మీ పొడవున బైపాస్ నిర్మించుకునే అవకాశం ఉంది. అయితే ఇందులో మూడో ఆప్షన్‌ను ఎన్‌హెచ్‌ఏఐ ఓకే చేసింది. ఆ రోడ్డు ఇప్పుడు ఓఆర్‌ఆర్‌కు సమీపంలో వస్తోందని, అందుకే ఆ రోడ్డు అవసరం ఉండదని చెప్పి కేంద్రం బైపాస్‌ను రద్దు చేసింది. రెండు రోడ్లు పక్కపక్కనే వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఆప్షన్ మార్చి తొలి రెండు ఆప్షన్లలో ఏదో ఒక ఆప్షన్‌ను ఎంచుకుంటే బాగుండేదని ప్రజలు భావిస్తున్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించాలని కోరుకుంటున్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేలా.. ఎయిర్‌పోర్టు కు ఉమ్మడి గుంటూరు జిల్లావాసులు సులభంగా చేరేలా.. రాజధాని అమ రావతి అభివృద్ధిలో కీలకమైన ప్రాజెక్టుగా ఉన్న విజయవాడ తూర్పు బైపాస్‌ను కేంద్రం రద్దు చేసింది. రాజధాని అమరావతికి చుట్టూ ఔటర్ రింగు రోడ్డు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇక తూర్పు బైపాస్ అవసరం లేదని తేల్చేసింది. గతంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ తూర్పు బైపాస్‌కు ఆమోదం తెలిపి ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించారు. బైపాస్ నిర్మాణానికి అలైన్‌మెంట్ కూడా ఖరారు చేశారు. ఇక భూ సేకరణ పనులు ప్రారంభమవుతాయనుకుంటున్న సమయంలో తాజాగా మంజూరైన ఓఆర్‌ఆర్ పేరుతో తూర్పు బైపాస్‌ను రద్దు చేయడం ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలను కలవరపెడుతోంది. ఓఆర్‌ఆర్, తూర్పు బైపాస్ పక్కపక్కగా వస్తాయి.. ఇక బైపాస్ అవసరం లేదని కేంద్రం చెప్పడం భావ్యం కాదని.. అలైన్‌మెంట్ మారిస్తే సరిపోయే దానికి రద్దు చేయడం సరికాదని ఇటు గుంటూరు, అటు విజయవాడవాసులు అభిప్రాయ పడుతున్నారు.

- ఆచరణకు నోచుకోని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ
- విజయవాడ తూర్పు బైపాస్‌కి రూ.2,176 కోట్లు కేటాయించినా రద్దు
- ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తొలగే అవకాశం లేదని గుంటూరు, కృష్ణా జిల్లా వాసుల ఆందోళన
- తూర్పు బైపాస్ రద్దుతో ఎయిర్‌పోర్టు కనెక్టవిటీపై ప్రభావం
- ఎన్‌హెచ్- 16తో ట్రాఫిక్ కష్టాలు.. వెస్ట్ బైపాస్‌తో 10-15 కి.మీ. అదనపు ప్రయాణం



ఈస్ట్ బైపాస్ నమూనా ప్రతిపాదనలు

ట్రాఫిక్ కష్టాలు..

రాజధాని నిర్మాణ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల రాక, కార్యకలాపాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో విజయవాడలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. సాధారణ రవాణాతోపాటు విజయవాడ ఆటోనగర్ రవాణా, బందరు పోర్టు రవాణాకు నాలుగు చోట్ల అవకాశం కల్పించారు. దీంతో మహానాడు జంక్షన్, రింగురోడ్డు జంక్షన్, రామవరప్పాడు గ్రామాల్లో ట్రాఫిక్ గంటల కొద్దీ ఆగి పోతోంది. దీంతో ఎయిర్‌పోర్టు చెకిన్ వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడు తున్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే పొట్టి పాడు టోల్‌గేటు వరకు వెళ్లి, అక్కడి నుంచి తిరిగి వెనక్కి రావాల్సి ఉంటుంది. అలా చేస్తే కనీసం 10 నుంచి 15 కి.మీ మేర అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదే ఈస్ట్ బైపాస్ అయితే నేరుగా ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ ఉంటుంది. ఈస్ట్ బైపాస్ రద్దు వల్ల రాజధాని అమరావతి సహా, గుంటూరు, తెనాలి, మంగళగిరి, రేపల్లె, దుగ్గిరాల, పొన్నూరు, చిలకలూరిపేట, మార్టూరు తదితర ప్రాంతాల ప్రజలతోపాటు కృష్ణా జిల్లాలోని బందరు, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ ప్రజలు ఎయిర్‌పోర్టుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడక తప్పదు.

మూడు ఆర్వోబీలు మంజూరు

- గెజిట్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ ఇక్కట్లకు శాశ్వత పరిష్కారం

నరసరావుపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మూడు ఆర్వోబీలు మంజూరయ్యాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను బుధవారం విడుదల చేసింది. రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనున్నది. గుంటూరు - నడికుడి రైల్వే సెక్షన్‌లో సత్తెనపల్లి - అమరావతి రోడ్డులోని పెదకూరపాడు యార్డు వద్ద రైల్వే ట్రాక్ క్రాసింగ్ 27 వద్ద ఆర్వోబీ మంజూరైంది. వెన్నాదేవి - కంకాణాల పల్లి రహదారిలో సత్తెనపల్లి - రెడ్డిగూడెం స్టేషన్ల మధ్య ఎల్‌సీ నెంబరు 40 వద్ద, దాచేపల్లి - కేశానుపల్లి రహదారిలో తుమ్మల చెరువు-నడికుడి స్టేషన్ల మధ్య ఎల్‌సీ నెంబరు 81 వద్ద ఆర్వోబీలు మంజూరయ్యాయి. ఈ మూడు గేట్లు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. వీటి మంజూరు కోసం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విశేషంగా కృషి చేశారు. వీటి మంజూరుపై ఎంపీ కృష్ణదేవరాయలు హర్షం వ్యక్తం చేశారు. ఆర్వోబీలు మంజూరు చేసిన రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌కు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.


పెదకూరపాడు రైల్వే ట్రాక్‌పై ఆర్వోబీ నిర్మించే ప్రదేశం

వైసీపీకి మర్రి షాక్



- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా
- రెండు రోజుల్లో పార్టీకి రాజశేఖర్ గుడ్‌బై
- అనుయాయులతో కలిసి త్వరలో టీడీపీలో చేరిక
- వరుస పరాభవాలు.. జగన్‌పై ఆగ్రహంతో నిర్ణయం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా ఉండటమే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలుత రథ సారథ్యం వహించిన మర్రి రాజశేఖర్ వైసీపీకి షాకిచ్చారు. ఎంతోకాలం నుంచి అందరూ ఊహించినట్లుగానే మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆయన తొలుత వైసీపీ ద్వారా తాను పొందిన ఎమ్మెల్సీ పదవిని వదిలేసుకున్నారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని బుధవారం శాసనమండలి చైర్మన్‌కు అందజేశారు. చిలకలూరిపేటలో కాంగ్రెస్‌లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అనంతరం వైసీపీ ఆవిర్భాంతో ఆ పార్టీలో చేరారు. అయితే విడదల రజిని రాజకీయ అరంగేట్రంతో నియోజకవర్గంలో మర్రి రాజశేఖర్ ప్రాధాన్యం తగ్గిపోయింది. 2019 ఎన్నికల్లో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న రాజశేఖర్‌ను కాదని వైసీపీలో కొత్తగా చేరిన విడదల రజినికి సీటు ఇవ్వడంతో మర్రి అనుయాయులు తిరుగుబాటు చేశారు. ఆ సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట వెళ్లిన వైఎస్ జగన్ రజినిని గెలిపిస్తే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా వెంటనే ఇవ్వకుండా రజినికి మంత్రి పదవిని కట్టబెట్టారు. ఈ క్రమంలో వరుస పరాభవాలతో రగిలిపోతున్న ఆయన కొద్దికాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో గుంటూరు పశ్చిమలో ఓడిపోయిన మాజీ మంత్రి విడదల రజినిని తిరిగి చిలకలూరిపేటకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయన ఉక్రోషంతో రగిలి పోయారు. ఆ సమయంలోనే ఆయన వైసీపీని వీడతారని కథనాలు వెలువడ్డాయి. అంతక మునుపు జగన్ రాజశేఖర్‌ను పిలిపించుకుని చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తానని హామీ ఇవ్వడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో సతీమణికి సీటు ఇస్తానని ఆశ పెట్టారని సమాచారం. ఇది జరిగిన కొద్ది రోజులకే రజిని చక్రం తిప్పడం ఆ తర్వాత వారం రోజులు గడవక ముందే మర్రికి ఇచ్చిన హామీని జగన్‌తుంగలో తొక్కి చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు రజినికి కట్టబెట్టటంతో మర్రి అవాక్కయ్యారు. ఇక ఆ రోజు నుంచే ఆయన టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. 2023లో ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వగా 2029 వరకు ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉన్నా కూడా పదవికి రాజీనామా చేయడం విశేషం. గత ఎన్నికల సమయంలో వైసీపీని వీడి టీడీపీలో చేరి తిరిగి ఎంపీగా గెలుపొందిన లావు శ్రీకృష్ణదేవరాయులతో రాజశేఖర్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. కాగా త్వరలో మంచి ముహూర్తం చూసుకుని తన అనుయాయులతో వైసీపీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు.

మండల పరిషత్ అధ్యక్షుల ఎన్నిక 27న

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు స్థానాల్లో ఖాళీలు
- అదే రోజున ఉపాధ్యక్ష, కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ల్లో ఎన్నికల నగారా మోగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీ గా ఉన్న మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కో-ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ బుధవారం అనుమతి ఇచ్చింది. తొలుత ఆయా పదవులు ఖాళీగా ఉన్న మండలాలకు కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమిస్తారు. నియమించబడిన ప్రత్యేక అధికారులు ఈ నెల 23 నాటికి మండల పరిషత్‌లోని సభ్యులకు నోటీసులు అందజేస్తారు. 27న నిర్వహించే ప్రత్యేక సాధారణ సమావేశంలో ఎంపీపీ, ఉప ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అచ్చంపేట, పిట్టలవానిపాలెం, దుగ్గిరాల మండల పరిషత్‌ల్లో అధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. నరసరావుపేట, గుంటూరు రూరల్, కారంపూడి మండలాల్లో ఉపాధ్యక్ష స్థానాలు ఖాళీగా ఉన్నాయి. భట్టిప్రోలు, తెనాలి, ముప్పాళ్ల మండల పరిషత్‌ల్లో కో-ఆప్షన్ సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఎన్నికల కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.







చిత్రజ్యోతి

SINCE 1965

నాన్నకు ప్రేమతో..


'దక్ష'లో మోహన్‌బాబు



ప్రస్తుతం మంచు కుటుంబంలో యుద్ధవాతావరణం నెలకొని ఉంది. ముఖ్యంగా తండ్రీకొడుకులు మోహన్‌బాబు, మనోజ్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితి. ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. తను సంపాదించిన ఆస్తులు, కట్టుకున్న ఇల్లు మనోజ్ ఆక్రమించాడని మోహన్‌బాబు స్వయంగా రంగారెడ్డి కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసుల సాయంతో మనోజ్‌ను హైదరాబాద్ జల్‌పల్లిలో ఉన్న తన ఇంటి నుంచి వెళ్లగొట్టారు మోహన్‌బాబు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మోహన్‌బాబు పుట్టిన రోజు వేడుకలు బుధవారం జరిగాయి. తండ్రి పుట్టినరోజు సందర్భంగా మనోజ్ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే నాన్నా.. మనమంతా కలసి వేడుకలు చేసుకునే ఈ రోజు మీ పక్కనే ఉండే అవకాశాన్ని కోల్పోయా. మీతో కలసి ఉండే క్షణాల కోసం ఎదురు చూస్తున్నా.. లవ్ యూ' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. మనోజ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి దీనిపై మోహన్‌బాబు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు

తన తండ్రి మోహన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా నటి మంచు లక్ష్మీప్రసన్న ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ముఖ్య పాత్రధారిగా తను నిర్మిస్తున్న 'దక్ష' చిత్రంలోని లుక్‌ను షేర్ చేసి "మా ప్రొఫెసర్, డాక్టర్. విశ్వామిత్రకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. 'కన్నప్ప' సినిమాలో మోహన్‌బాబు మహదేవ శాస్త్రిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని 'ఓం నమః శివాయ' అనే పాటలో ఆయన పాత్రకు సంబంధించిన వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.

కడుపుబ్బా నవ్వించే చిత్రం


సప్తగిరి

సప్తగిరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'పెళ్లికాని ప్రసాద్'. అభిలాష్‌రెడ్డి గోపిడి దర్శకత్వంలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. దిల్‌రాజు నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ సినిమాను విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సప్తగిరి. "దర్శకుడు అభిలాష్ ఈ కథ చెప్పేటప్పుడే సినిమా విజయంపై పూర్తి నమ్మకం వచ్చేసింది. అందరినీ కడుపుబ్బా నవ్వించే చిత్రమిది. ఎక్కడా బోర్ కొట్టదు. దర్శకుడు అభిలాష్ రాసిన సంభాషణలు, వినోదాత్మక సన్నివేశాలు, శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

అద్భుతమైన అనుభూతినిచ్చేలా...



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, నిహాల్ కోదాటి, సాన్వీ మేఘన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో దర్శకుడు సుప్రీత్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినిచ్చేలా సరికొత్తగా ఉంటుందీ సినిమా. అందరి మనసులు గెలుచుకుంటుంది" అని అన్నారు. "సినిమా తప్పక విజయం సాధిస్తుంది" అని నిర్మాత రాహుల్ రెడ్డి చెప్పారు.

బ్యాక్ టు హైదరాబాద్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డాక్టర్ కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. పదిహేను రోజులుగా ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సేల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మంగళవారం రాత్రితో షెడ్యూల్ పూర్తి కావడంతో చిత్ర యూనిట్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైంది. యాక్షన్ అడ్వెంచర్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు రాజమౌళి.

అందమైన ప్రేమకథ



వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ శుక్రవారం విడుదలవుతోందీ చిత్రం. తాజాగా, నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో హీరో వినయ్‌కుమార్ మాట్లాడుతూ "కలహాలే లేని అందమైన ప్రేమకథ ఇది" అని అన్నారు. "ఈ కవితాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి విజయం సాధిస్తుంది" అని దర్శకుడు శింగార మోహన్ చెప్పారు. "ఇదో స్వచ్ఛమైన ప్రేమకథ. సినిమా అద్భుతంగా ఉంటుంది" అని నిర్మాత మరే శివశంకర్ తెలిపారు.

మహిళల సమస్యలపై..



షెరాజ్ మెహదీ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ కథానాయికలు. సురీందర్ కౌర్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. హీరో షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రమైనా.. పెద్ద విజయం సాధిస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతుంది" అని చెప్పారు. హీరోయిన్ కృతి వర్మ మాట్లాడుతూ "ఈ సినిమా కథ వినగానే గూస్‌బంప్స్ వచ్చాయి" అని చెప్పారు. హీరోయిన్ విహాన్షీ హెగ్డే మాట్లాడుతూ "మహిళల సమస్యలపై తీసిన చిత్రమిది" అని తెలిపారు.





ఎన్టీఆర్ వైద్యసేవలోని లోపాలపై దృష్టి సారించండి : ప్రత్తిపాటి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం కోరేవారి సంఖ్య పెరగడంపై ప్రభుత్వం ఆలోచించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం సూచించారు. అసెంబ్లీలో రాష్ట్ర వైద్యరంగంపై జరిగిన చర్చలో పుల్లారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలోని విధాన లోపాలు, క్షేత్రస్థాయిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గుండె, కిడ్నీ ఇతర ప్రధాన అవయవాల శస్త్రచికిత్సలు, క్యాన్సర్ చికిత్సలకు కొన్ని ఆసుపత్రులు అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. చిలకలూరిపేటలో వందపడకల ఆసుపత్రిని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాని కోరారు.

పశుసంవర్ధక శాఖలో భారీ కుంభకోణం

వెటర్నరీ మొబైల్ క్లినిక్‌ల కొనుగోళ్లలో అవినీతి

అసెంబ్లీలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల ధ్వజం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరుటౌన్, గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆర్కేవీవై స్కీమ్‌లో భాగంగా కొనుగోలు చేసిన వెటర్నరీ మొబైల్ కొనుగోళ్ల క్లినిక్స్‌లో జరిగిన భారీ అవినీతిపై విచారణ జరపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం శాసనసభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మొబైల్ అంబులెన్స్‌ల కొనుగోళ్లలో ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారుల కుమ్మక్కుతోనే నాటి ప్రభుత్వ పెద్దలు భారీ దోపిడీకి తెర లేపారని ఆరోపించారు. వాహన కొనుగోళ్ల ధరలను పక్క రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో భారీ వ్యత్యాసం ఉందన్నారు. ఫేజ్-1లో 175 వాహనాలు రూ. 145 కోట్లతో, ఫేజ్-2లో 165 వాహనాలు రూ. 110 కోట్లతో కొనుగోలు చేశారని చెప్పారు. మొదటి దశలో వాహనం, ఆపరేటింగ్ సిస్టం కలిపి ఒక్కో క్లినిక్‌ను రూ. 82 లక్షలకు కొనుగోలు చేస్తే రెండవ దశలో రూ. 68 లక్షలు చెల్లించారన్నారు. ఈ రెండు దశల మధ్య ఒక్కో క్లినిక్ ఏర్పాటుకు రూ. 14లక్షల వ్యత్యాసం ఉందన్నారు.

సీఆర్‌డీఏకి భారీగా ఇసుక డిమాండ్

● కోటి 98 లక్షల 35 వేల 670 క్యూబిక్ మీటర్లకు ఇండెంట్ ● ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా, హెచ్ అండ్ జీ, ఏడీసీఎల్ నుంచి విజ్ఞప్తులు

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నగరంలో ఇప్పటికే కొన్ని పెండింగ్ పనుల నిర్మాణం ప్రారంభం కావడం... మరికొద్ది రోజుల్లో రూ.వేల కోట్ల వర్కులు కూడా మొదలు కానుండటంతో సీఆర్‌డీఏకి భారీగా ఇసుక అవసరం ఏర్పడింది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన, ఇళ్లు, భవనాల నిర్మాణాలకు ఇసుక అవసరమని సీఆర్‌డీఏకి ఇటీవలే ఇండెంట్లు అందాయి. దాంతో ఆ సంస్థ గుంటూరు జిల్లా గనులు, భూగర్భ శాఖకు ఇసుక డిమాండ్ వివరాలను తెలియజేయగా ఆ మేరకు సరఫరా చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తున్నది. కేవలం మూడు నెలల వ్యవధిలో 51 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం ఉండటంతో కృష్ణానదిలో పలుచోట్ల పూడిక తొలగింపు, తవ్వకాల ద్వారా సరఫరా చేసేందుకు ప్రణాళికని సిద్ధం చేస్తున్నది. ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు నుంచి ఇటీవలే గుంటూరు జిల్లా మైనింగ్ డిపార్టుమెంట్‌కు కేటగిరీల వారీగా ఇసుక డిమాండ్ విజ్ఞప్తి అందింది. ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాకు కోటి 18 లక్షల 69 వేల 500 క్యూబిక్ మీటర్లు, హెచ్ అండ్ బీకి 11 లక్షల 77 వేల 815, ఏడీసీఎల్‌కి 67 లక్షల 88 వేల 355 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమని నివేదించారు. ఇందులో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ప్రతీ 15 రోజులకు ఒకసారి ఇసుక సరఫరా చేయాలని కోరారు. మొదటి నెలలో 8.65 లక్షలు క్యూబిక్ మీటర్ల మేరకు రెండు సార్లు, రెండో నెలలో 8.49 లక్షల మేరకు రెండు సార్లు, మూడో నెలలో కూడా 8.49 లక్షల మేరకు రెండుసార్లు ఇసుక సరఫరా చేయాలన్నారు. ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు, ఏడీసీ నుంచి అమరావతి రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూరుస్తున్నది. అలానే హడ్కో నుంచి రూ.11 వేల కోట్ల రుణం లభించింది. అలానే జర్మనీకి చెందిన మరో బ్యాంకు నుంచి రూ.5 వేల కోట్ల రుణం మంజూరు కాబోతున్నది. రహదారుల నిర్మాణం, ఎల్‌పీఎస్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి అనేక పనులను వివిధ సంస్థలు చేపట్టబోతున్నాయి. దీంతో ఇసుకకి భారీగా డిమాండ్ ఏర్పడింది. కాగా గుంటూరు జిల్లాలో ప్రస్తుతం గుండిమెడ-2 ఓపెన్ రీచ్‌లో 51 వేలు, బొమ్మువానిపాలెం-1లో 72 వేలు, బొమ్మువానిపాలెం-16 ఓపెన్ రీచ్‌లో 2.50 లక్షలు, బొమ్మువానిపాలెం-17 ఓపెన్ రీచ్‌లో లక్ష, రాయపూడిలో పూడిక తొలగింపు చేపట్టాల్సిన ప్రదేశంలో 1.19 లక్షలు, నేవిగేషన్ ఛానల్‌లో డ్రెడ్జింగ్ చేస్తే 5.16 లక్షలు, బోరుపాలెంలో 2.30 లక్షలు, బొమ్మువానిపాలెం-14లో 47 ఏవుల, బొమ్మువానిపాలెం-15లో 55 వేల క్యూబిక్ మీటర్లు మొత్తం కలిపి 14.49 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. 54 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఇసుక డిమాండ్ ఉండటంతో దాదాపుగా 45 లక్షల టన్నుల ఇసుక లోటు ఉన్నది. ఈ నేపథ్యంలో జిల్లాలో మరికొన్ని ఇసుక మేటలు ఉన్న ప్రదేశాలను గుర్తిస్తామని, అయినప్పటికీ సీఆర్‌డీఏ అవసరం మేరకు సరఫరా చేయలేని పరిస్థితి ఉంటుందని గుంటూరు జిల్లా అధికారులు తెలిపారు. ఈ కారణంగా కృష్ణా, పల్నాడు, బాపట్ల, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కూడా ఇండెంట్ పెట్టాల్సిందిగా సీఆర్‌డీఏకి సూచిస్తున్నారు.

మద్యం మత్తు బానిసలకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వండి

ఎక్సైజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ నిశాంత్ కుమార్



డీ ఎడిక్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న నిశాంత్ కుమార్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తుకు బానిసైన వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మతో కలిసి బుధవారం ఆయన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ ఎడిక్షన్ సెంటర్‌ను, గుంటూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలోని లేబరేటరీని పరిశీలించారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ మత్తుమందుకు బానిస అయిన వారు మత్తుకు దూరంగా ఉండేలా చేయాలని, అందుకు కౌన్సెలింగ్ బాగా ఉపయోగపడుతుందన్నారు. క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో కౌన్సెలింగ్ ఇవ్వటంతో వారిలో క్రమక్రమంగా మార్పు కనిపిస్తుందన్నారు. ఈ విధంగా మార్పు రావడం వల్ల వారు మత్తుకు దూరంగా ఉంటారని అన్నారు. మద్యం మత్తులో పడితే వారి జీవితాలు ఇబ్బందులకు గురవుతాయని, మానసిక స్థితి సక్రమంగా ఉండదని, దీనివల్ల కుటుంబం చిన్నా బిన్నమవుతుందన్నారు. గుంటూరు ఎక్సైజ్ కార్యాలయంలోని లేబరేటరీని పరిశీలించి కొత్తగా ఏర్పాటు చేసిన మిషనరీ ఎలా పని చేస్తుందని అడిగి తెలుసుకున్నారు. కల్తీ మద్యంపై నిఘా ఉంచాలని, శాంపిల్స్‌లో ఏ మాత్రం అనుమానం ఉన్నా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ కుమారి, ఏఈ ఎస్ మారయ్య బాబు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 518.90 అడుగులు ఉంది. ఇది 147.27 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7852 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,685 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మేడికొండూరు వ్యవసాయ అధికారిపై వేటు

● యలవర్తిపాడు పంట నష్ట పరిహారం అక్రమాలపై చర్యలు
● పల్నాడుకు డిప్యుటేషన్‌పై పంపుతూ కమిషనర్ ఉత్తర్వులు

గుంటూరు సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పంట నష్ట పరిహారం చెల్లింపుల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మేడికొండూరు మండల వ్యవసాయ అధికారి ఎం నాగరాజుపై తాత్కాలిక బదిలీ వేటు వేశారు. మేడికొండూరు మండలం యలవర్తిపాడులో గత ఏడాది జరిగిన వరదల్లో పంట నష్టం భారీగా జరిగింది. పంట నష్ట పరిహారం కాజేసేందుకు వ్యవసాయ శాఖ అసిస్టెంట్, రెవెన్యూ సిబ్బంది ముందుగానే ప్రణాళికలు రచించారు. లేని రైతులను ఈ-పంటలో నమోదు చేసి నష్ట పరిహారం దారి మళ్లించారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో అప్పట్లోనే అగ్రికల్చర్ అసిస్టెంట్, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు చేపట్టారు. మండల ఏవో ఈ విషయంలో అప్రమత్తంగా లేరన్న ఆరోపణలు రావటంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా వ్యవసాయ అధికారి కమిషనర్‌కు సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఏవో నాగరాజును పల్నాడు జిల్లా రైతు శిక్షణా కేంద్రానికి డిప్యూటేషన్‌పై పంపుతూ బుధవారం వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఫిరంగిపురం ఏవో వాసంతికి మేడికొండూరు వ్యవసాయ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

'సాయి సాధన' కేసు గుంటూరుకి బదిలీ

నరసరావుపేట లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిట్‌ఫండ్ దారులను, డిపాజిట్ దారులను భారీస్థాయిలో మోసగించినట్లు వేలూరు సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసు గుంటూరులోని ఆరవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు బదిలీ అయింది. ఈ కేసును గుంటూరు ఆరవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు బదిలీ చేయవలసిందిగా పోలీస్‌లు పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయస్థానంలో పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా గుంటూరు జిల్లాప్రధాన న్యాయస్థానానికి బదిలీ అయింది. ఈ మేరకు బుధవారం నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయస్థానం ఏపీపీ మల్లారెడ్డి కోర్టులో రిప్రజెంటేషన్ చేశారు. ఈ కేసులో సంస్థతో పాటు మరో ఆరుగురిని పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. పాలడుగు పుల్లారావు, ఆయన భార్య వాణిశ్రీ ,కుమారుడు పవన్ కుమార్, కుమార్తె శ్రీహర్షవర్ధిని, అల్లుడు ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ నూకవరపు రాజారమేష్, నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన గాలికోటయ్యలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

మిర్చియార్డులో భోక్తలపై క్రిమినల్ చర్యలు

● అసెంబ్లీలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)లో జరిగిన అవినీతి, అక్రమాలపై బుధవారం శాసనసభలో చర్చ జరిగింది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్‌అహ్మద్ వేసిన ప్రశ్నపై మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటన చేశారు. ఈ ప్రశ్నకు అనుబంధంగా నసీర్‌తో పాటు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్(పొన్నూరు), బూర్ల రామాంజనేయులు(ప్రత్తిపాడు) గళం విప్పారు. దాదాపుగా 20 నిమిషాలకు పైగా ఈ ఒక్క ప్రశ్న పైనే చర్చ జరగడం విశేషం. వైసీపీ ప్రభుత్వంలో మిర్చియార్డులో అనేక అక్రమాలు జరిగాయని, రూ.347.71 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని విజిలెన్స్ నివేదిక ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. ఒకరిద్దరు మాజీ ఛైర్మన్లు, 19 మంది అధికారులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసినట్లు తెలిపారు. యార్డులో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వచ్చిన పరిహారంలోనూ గత కాంగ్రెస్‌లో పాలకులు(ప్రస్తుతం వైసీపీ) దోచుకున్నారని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వివరించారు. ఈనాం విధానాన్ని పక్కనపెట్టి రూ.160 కోట్లు రావాల్సిన మార్కెట్ సెస్‌ను రూ.80 కోట్లకు చూపించారని తెలిపారు. వైసీపీ వాళ్ల బంధువులు, మిత్రులకు 287 లైసెన్సులను అక్రమంగా కట్టబెట్టారని, ఇందులోనూ దోపిడీ జరిగిందని తెలిపారు. మిర్చియార్డుని సమూలంగా ప్రక్షాళన చేయాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కోరారు. టీడీపీ ఆఫీసుపై దాడికి మిర్చియార్డులో వైసీపీ నాయకులు వ్యూహరచన చేశారని ఆరోపించారు. మిర్చియార్డుని విభజన అయినా చేయాలని, లేకుంటే ప్రత్తిపాడుకు తరలించాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు.

గేట్‌లో భాష్యం పూర్వ విద్యార్థికి 25వ ర్యాంక్



గంటా హేమంత్

గుంటూరు (విద్య) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) 2025 బుధవారం విడు దల చేసిన పరీక్షా ఫలితాలలో భాష్యం పూర్వ విద్యార్థి ఘంటా హేమంత్ జాతీయస్థాయిలో 25వ ర్యాంకును సాధించినట్లు భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో ఐఐటీ రూర్కీ ద్వారా గేట్ పరీక్ష నిర్వహించారు. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (డీఏ) విభాగంలో భాష్యం పూర్వ విద్యార్థి జాతీయస్థాయిలో ఆలిండియా 25వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. హేమంత్ స్కూల్ స్థాయి నుంచి భాష్యం విద్యా సంస్థల్లో చదువుకుని భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ ద్వారా 2021లో ఐఐటీ మద్రాస్‌లో సీటు సాధించినట్లు గుర్తు చేశారు. హేమంత్‌ను, వారి తల్లిదండ్రులను ఛైర్మన్ రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్‌లు అభినందించారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● ఐజీ, ఏపీ ఈగల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ

తాడికొండ(లాం), మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో జీవితం సర్వ నాశనమవుతుందని ఐజీ, ఏపీ ఈగల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ తెలిపారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐజీ ఆకే రవికృష్ణ

చలపతి విద్యాసంస్థలు ప్రారంభమై 30 సంవత్సరాలు అవ్వటంతో నాలుగురోజుల పాటు మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆకే రవికృష్ణ, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ చాలా ముఖ్యమైందన్నారు. నేటి యువత సినిమాల్లో చూపించే డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు త్వరగా బానిసలు అవుతున్నారన్నారు. మద్యం, గంజాయి, కొకైన్, బ్రౌన్ షుగర్ ఇతర పదార్థాల కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈగల్ ఆర్గనైజేషన్ ఎస్పీ కే నగేష్‌బాబు మాట్లాడుతూ నేటి యువత టెక్నాలజీని చెడుమార్గంలో ఉపయోగిస్తున్నారన్నారు. వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ చలపతి విద్యాసంస్థలు ఒక స్కూల్‌తో ప్రారంభమై ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలుగా ఎదిగి ప్రగతి పథంలో ముందుకు దూసుకువెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్, అకాడమిక్ డీన్ జే లక్ష్మీనారాయణ, ట్రైనింగ్ డీన్ చందు రవిశంకర్, డైరెక్టర్ డీ వినయ్‌కుమార్, నాగగోపిరాజు, డీ తిరుపతినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తురకా కిశోర్‌ను నెల్లూరుకు తరలించిన పోలీసులు

మాచర్లటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి సోదరుల ప్రధాన అనుచరుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తురకా కిశోర్, అతని సోదరుడు శ్రీకాంత్‌లను నెల్లూరు జైలుకు తరలించారు. క్రైం నంబరు 69/2022లో ఈనెల 6వ తేదీన మండలంలోని విజయపురిసౌత్ పోలీసులు మంజుల చిన అంజిపై జరిగిన దాడి, కారు ధ్వంసం కేసులో పీటీ వారెంట్ ద్వారా కోర్టుకు హాజరుపరిచారు. ఆ కేసులో రిమాండ్‌పై నెల్లూరులో ఉండగా విచారణ నిమిత్తం కోర్టు ద్వారా రెండు రోజుల అనుమతి పొందిన పోలీసులు మంగళ, బుధ వారాలు గురజాల పోలీసు స్టేషన్లో విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ షఫి విచారించి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ న్యాయవాది (పీపీ) పీఆర్ రవీంద్రబాబు వాదనలు వినిపించగా, కిశోర్ తరుపున వరప్రసాద్ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం న్యాయమూర్తి పీ ప్రశాంత్ రిమాండ్ కొనసాగింపునకు అనుమతి ఇచ్చా రు. దీంతో విజయపురిసౌత్ పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు. గురువారంతో ఈ కేసులో రిమాండ్ 14 రోజుల గడువు పూర్తి కానుంది.

క్రేన్ గ్రూపు సంస్థల్లో రెండో రోజు కొనసాగిన ఐటీ సోదాలు

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను శాఖ అధికారులు గుంటూరు నగరంలోని క్రేన్ గ్రూపు సంస్థల్లో సోదాలను రెండో రోజు కూడా కొనసాగించాయి. మంగళవారం ప్రారంభమైన సోదాలు బుధవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా విలువైన బంగారు, వెండి, వజ్రాభరణాలు, కొంత మొత్తంలో నగదు, కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ సోదా లలో ఏమేమి సీజ్ చేసిందనే వివరాలను ఇంకా ఐటీ శాఖ ప్రకటన చేయలేదు.

హత్యకేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

బాపట్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మహిళను హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ బాపట్ల ఆరవ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి కె.శ్యాంబాబు బుధవారం తీర్పునిచ్చారు. ఎస్పీ తుషార్ డూడీ తెలిపిన వివరాలు ప్రకారం.. చంద్రగూడెం గ్రామానికి చెందిన బొల్లిపోగు 2012లో గుంటూరులోని ఓ కళాశాలలో కేర్‌టేకర్‌గా చేరింది. అక్కడే ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే గారపాటి రాజశేఖర్ మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 2013 మార్చి 22న బాపట్ల మండలంలోని అడవిగ్రామపంచాయతీ మత్స్యశాఖవారి శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ సమీపంలోని ఏకాంత ప్రదేశానికి తీసుకొచ్చి లైంగిక కోరికను తీర్చుకున్న తర్వాత పదునైన ఆయుధంతో హత్య చేశాడు. దీనిపై గ్రామపంచాయతీ వీఆర్వో ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి రూరల్ ఎస్ఐ వై.కోటేశ్వరరావు హత్య కేసుగా నమోదు చేశారు. సీఐ వై.రామారావు కేసు దర్యాప్తు చేసి నేరస్థుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. బాపట్ల ఆరవ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులో కేసుకు విచారణకు రాగా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వర్, సెషన్స్ కోర్టు హెడ్‌కానిస్టేబుల్ జి.శివయ్యలు, సాక్షులు సరైన రీతిలో సాక్ష్యం చెప్పటంతో నిందితుడు గారపాటి రాజశేఖర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెలువడినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

ఆగి ఉన్న మద్యం లారీని మరో లారీ ఢీ



బోల్తాపడిన మద్యం లోడు లారీ

యడ్లపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న మద్యం లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న సంఘటన పదహారో నంబరు జాతీయరహదారిపై యడ్లపాడు వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 27 వై 2345 నంబరు గల లారీ సింగరాయకొండలోని స్టాక్ పాయింట్ నుంచి మద్యం లోడుతో సామర్లకోటకు మంగళవారం బయలుదేరింది. పిల్లికొండవద్దకు రాగానే డ్రైవర్ లారీని పక్కగా నిలిపి కేబిన్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో అదే మార్గంలో వచ్చిన ఏపీ 39 యూఎన్ 2179 నంబరు గల లారీ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. లారీ రెయిలింగ్‌ను దాటుకుని సర్వీసురోడ్డులోకి పల్టీకొట్టింది. కేబిన్‌లో పడుకున్న డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ కునుకు తీయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మద్యం బాటిళ్ల ప్లాస్టిక్‌వి కావడంతో నష్టం పెద్దగా ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

వేటకు వెళ్ళి నిజాంపట్నం చెందిన మత్స్యకారుడు మృతి



నాగవర్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ తిరుపతిరావు

రేపల్లె, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్ళి నిజాంపట్నం కలిమి సెంటర్‌కు చెందిన ఒడుగు నాగవర్మ(24) మృతి చెందాడని నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు బుధవారం తెలిపారు. నిజాంపట్నం మండలం దిండి పరిశావారిపాలెం బీచ్ వద్ద వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు మునిగిపోవటంతో గాలింపుచర్యల్లో నాగవర్మ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఎస్ఐ పరిశీలించారు. నాగవర్మ తండ్రి నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

మిర్చిని తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

కారంపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు మిర్చి పంటకు నిప్పంటించారు. బాధిత రైతు వజ్రాల సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేసి రెండో కోత పూర్తి చేసి మార్కెట్‌కు తరలించేందుకు 50 క్వింటాళ్ల ఎండు మిర్చిని కల్లంలో నిల్వ చేశాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంటను తగులబెట్టారు. సుమారు రూ. 6 లక్షలు నష్టం జరిగినట్లు బాధితుడు సురేష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ వాపోయాడు.

పురుగుమందు తాగి వ్యాపారి ఆత్మహత్య

ప్రత్తిపాడు. మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో పత్తి కమీషన్ వ్యాపారి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పాతమల్లాయపాలెం సమీపంలో జరిగింది. పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కాసు నాగిరెడ్డి (56) పత్తి కమీషన్ వ్యాపారం చేస్తూ గుంటూరులో నివాసం ఉంటున్నాడు. పది సంవత్సరాలుగా నాగిరెడ్డి రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని బొమ్ము కొండారెడ్డికి అమ్ముతుంటాడు. శ్రీకాకుళం జిల్లా దిమ్మిడిజోలా గ్రామపరిధిలో రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి రూ.43 లక్షలు కొండారెడ్డి నుంచి రావలసి ఉంది. ఈ డబ్బు కొండారెడ్డి ఇవ్వకపోగా, కోర్టుకు వెళతా అంటూ బెదిరిస్తున్నాడు. ఒక వైపు రైతుల నుంచి డబ్బుల కోసం వత్తిడి పెరిగి పోవడం, మరో వైపు తనకు ఇవ్వాల్సిన కొండారెడ్డి బెదిరిస్తుండటంతో తీవ్ర మనస్థాపానికి గురైన కాసు నాగిరెడ్డి అప్పులకు సంబంధించి వివరాలతో నోట్ రాసి పొలం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు నాగిరెడ్డి భార్య రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

పాము కాటుకు రైతు మృతి

నకరికల్లు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని నరసింగపాడు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోనముక్కల పరమేశ్వర రెడ్డి పొలంలో గేదెలకు గడ్డి కోసే సమయంలో పాము కరవటంతో స్పృహ తప్పి పడిపోయాడు. అతనిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు ఈ సందర్భంగా వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

1,24,077 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,27,005 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,24,077 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 66,903 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13100
నంబరు. 5	10000	13500
273	10000	13000
341	10500	14500
4884	10000	12000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	--	--

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10500	13800
బంగారం	11000	12500
బ్యాడిగి 355	--	--
సింజెంటా బ్యాడిగి 5531	10000	13500
ఎన్ఎస్ 250 బుల్లెట్	10000	11500
ఆర్మూరు	11000	13300
తాలుకాయలు	5000	7500

అమెరికా తెలుగు సంబరాలకు ఎమ్మెల్యే భాష్యంకు ఆహ్వానం

పెదకూరపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగే 8వ తెలుగు సంబరాలకు రావాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను కలసి ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతినిధి ఆహ్వానం అందించారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో నాట్స్ రెసిడెంట్ శ్రీహరిరావు మండాది ఈ ఆహ్వానపత్రికను బుధవారం ఆయనకు అందించారు. జూలై 4, 5, 6 తేదీల్లో అమెరికాలోని ఫ్లోరిడాలో ఈ కార్యక్రమం జరగనున్నదన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

దుర్గి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దుర్గిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఆరో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి బుధవారం తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి 22నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

రెంటచింతల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వున్న రేషన్ కార్డుదారులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ఎం.అర్జున్‌నాయక్ కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈకేవైసీ చేయించాలని లేకుంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కారంపూడి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. ఈనెల 19, 20వ తేదీన కారంపూడి-2, 21న పేటసన్నిగండ్ల, 22న చింతపల్లి, 25న కారంపూడి-1, 26న ఒప్పిచర్ల-2, 27న మిరియాల, 28వ తేదీన నరమాలపాడు సచివాలయంలో ఈ క్యాంపులు నిర్వహించనున్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు
ఎంపీడీవో కె.సరోజనిదేవి

రెంటచింతల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకం కింద రుణాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో కె సరోజనిదేవి చెప్పారు. 21 నుంచి 60 ఏళ్ల లోపుగల వారు రుణాలకు అర్హులుగా పేర్కొన్నారు. ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ, విద్యార్హత, పాస్‌పోర్టు ఫోటోలతో ఈనెల 22వ తేదీ లోపు గ్రామ సచివాలయం, మీ సేవా, ఇంటర్నెట్ సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రాలు రెండు సెట్లు చొప్పున మండల పరిషత్ కార్యాలయంలో అందచేయాలన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

పిడుగురాళ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని లెనిన్‌నగర్‌లో కార్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలు స్వయం ఉపాధికి ఆర్థికంగా బలోపేతం అయ్యే దిశగా కుట్టుశిక్షణ అనంతరం మిషన్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెడ్స్ సంస్థ డైరెక్టర్ ఎం స్వర్ణలతాదేవి, క్రాక్ పాఠశాల హెచ్‌ఎం పి.లత, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, కార్ఫ్ సంస్థ డైరెక్టర్ కె.మేరి 9మంది మహిళలకు మిషన్లు అందజేశారు. టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు షేక్ సైదా పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 93మంది హాజరు

పిడుగురాళ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పిడుగురాళ్ల జూనియర్ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించినట్లు జిల్లా ఉద్యోగ కల్పన అధికారి ఎం రవీంద్రనాయక్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు 93మంది నిరుద్యోగులు హాజరు కాగా 56 మందికి అర్హతలను బట్టి ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ పి శ్రీకాంత్, ట్రైనర్ మస్తాన్, కంపెనీ హెచ్‌ఆర్‌లు, సిడాక్ జాబ్ రీసోర్స్‌పర్సన్ నరిక్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలపై అవగాహన

పిడుగురాళ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి పథకాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని సీఎస్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.బబిత తెలిపారు. బుధవారం కొండమోడు సమీపంలోని కెఎన్‌ఆర్ విద్యాసంస్థలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మండూరి వెంకటరమణ, శిక్షకురాలు పి దుర్గ, కేఎన్‌ఆర్ విద్యాసంస్థ డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావు, ముస్లిం మైనారిటీ మహిళలు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగపర్చుకోండి

మాచవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగ పరుచుకోవాలని ఎంపీడీవో వెంగళరావు ప్రజలకు సూచించారు. బుధవారం మోర్జంపాడు, మాచవరం సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభించామని ఈనెల 22వ తేదీ వరకు ఈ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు ఆధార్ తప్పనిసరిగా నమోదు చేయించాలని ఎంపీడీవో సూచించారు. ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాలు పని చేస్తాయన్నారు.

సోషల్ ఆడిట్
పారదర్శకంగా నిర్వహిస్తాం
● ఎస్‌ఆర్‌పీ జీఎస్ రాజు

మాచవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్ఆర్‌పీ జీఎస్ రాజు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో రూ రూ.4,75,52,094 పనులు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో గురువారం నుంచి తనిఖీ బృందాలు ఆయా పనులను పరిశీలిస్తాయన్నారు. తరువాత మండలస్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో వెంగళరావు, పీఆర్ ఏఈ నాగేశ్వరరావు, ఏపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

27న ఉప సర్పంచ్ ఎన్నికలు

మాచవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన మండలంలోని మూడు గ్రామాలకు ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగళరావు బుధవారం తెలిపారు. మాచవరం, పిన్నెల్లి, వేమవరం గ్రామాల ఉప సర్పంచ్‌లు రాజీనామాలు చేసిన విషయం విదితమే. ఈనెల 23వ తేదీ లోపు ఆయా గ్రామాల వార్డు సభ్యులందరికీ నోటీసులు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో వెంగళరావు ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల్లో వసతులు సక్రమంగా ఉండాలి

● ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి
● భూముల రీసర్వేలో రైతులందరినీ భాగస్వాములను చేయాలి
● కలెక్టర్ పీ అరుణ్‌బాబు


కండ్లకుంటలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, పక్కన తహసీల్దార్ కే పుల్లారావు

నకరికల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షాకేంద్రాల్లో అన్ని వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం వంగా వెంకటరెడ్డి జడ్పీ హైస్కూల్లో పరీక్షాకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. డీఈవో చంద్రకళ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు కల్పిస్తున్న వసతుల గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 6నుంచి 11గంటలలోపే పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆయనతో పాటు డ్వామా పీడీ సిద్దలింగమూర్తి, ఎంపీడీవో జీ కాశయ్య అన్నారు.

భూముల రీసర్వేలో రైతులను భాగస్వాములను చేయండి

భూముల రీసర్వేలో రైతులను భాగస్వాములను చేయాలని కలెక్టర్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కండ్లకుంట గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. నిర్దేశించిన సమయంలోగా రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆయనతోపాటు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి మధుకీర్తి, తహసీల్దార్ కే పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

అటవీభూముల నుంచి గ్రామాన్ని విడగొట్టాలి

● నేడు గ్రామాన్ని సందర్శించనున్న అటవీ శాఖ ఉన్నతాధికారులు
● గ్రామకంఠంగా ఏర్పాటుచేయాలని గ్రామస్థుల డిమాండ్


భట్రుపాలెంలో 12వ శతాబ్దంలో నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహా స్వామి దేవాలయ ముఖద్వారం


పూర్వీకులు తాగునీటి కోసం నిర్మించిన దిగుడు బావి


12వ శతాబ్దంలో ఆలయ నిర్మాణ సమయంలో ఏర్పాటుచేసిన శిలాశాసనం

దాచేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శతాబ్దాల నుంచి పూర్వీకులు కంప, రాళ్ళు, రప్పలను తొలగించి ఇళ్ళు నిర్మించుకొని కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారు. నేటికీ ఆ గ్రామం ఆ అటవీభూమిగానే కొనసాగుతోంది. గ్రామాన్ని అటవీచట్టాల నుంచి తొలగించి గ్రామకంఠం గా ఏర్పాటుచేసుకొని సొంత భూమిగా మార్చుకోవాలని గ్రామస్థులు 150 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో గ్రామస్థు లు అటవీశాఖ అధికారులకు తమ సమస్యను వె ల్లడించారు. స్పందించిన సదరు అధికారులు గురువారం దాచేపల్లి మండలం భట్రుపాలెం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో పలు అంశాలపై చర్చించనున్నారు. గ్రామస్థులు మాట్లాడు తూ తమ పూర్వీకుల నుంచి వందల ఏళ్లగా అడవితల్లి ఒడిలో పురుడుపోసుకొని జీవిస్తున్నామన్నారు. వన్యప్రాణుల సంరక్షణ అంటూ తమ జీవనంపై, నివాసాలపై దాడులు చేస్తున్నారన్నారు. గోడు వినేవారే కరువయ్యారన్నారు. ఇళ్ళు కట్టుకోవాలన్నా, భూముల సాగు, బోర్లు, కరెంటు సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలన్నా అటవీచట్టాలు అడ్డుగా ఉన్నాయన్నారు. చనిపోయిన వ్యక్తులను ఖననం చేయాలన్నా అటవీశాఖ అధికారుల తీరుతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని ఆనుకొని కృష్ణానది ప్రవహిస్తున్నా ఆ నీరు గుక్కెడు కూడా అందవన్నారు. శతాబ్దాలు గడుస్తున్నా తమ బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదని గ్రామస్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు గ్రామస్థుల అభిప్రాయాలను సేకరించనున్నారు. త్వరలో తమకు అటవీ హక్కుల చట్టాల నుంచి విముక్తి కల్పించాలని అందుకు అధికారులు సహకరించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

అంతర్ కళాశాలల పోటీలలో
స్కాలర్స్ విద్యార్థుల ప్రతిభ

పిడుగురాళ్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాఫ్ట్ బాల్ పోటీలు గుంటూరు ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో బుధవారం జరిగాయి. పోటీలలో పిడుగురాళ్లకు చెందిన స్కాలర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఆలిండియా విశ్వవిద్యాలయాల పరిధిలో జరుగబోయే పోటీలకు యూనివర్సిటీ జట్టుకు ఈ నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను స్కాలర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు జి.శ్రీనివాసరెడ్డి, ఎం.జగదీష్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల జనార్ధన్, గాదె బ్రహ్మారెడ్డి, రంగారెడ్డి, పీఈటీ రామారావు అభినందించారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

● దొడ్లేరులో రాస్తారోకో ● అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

క్రోసూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలం దొడ్లేరులో సాగునీటి కోసం అన్నదాతలు రోడ్డెక్కారు. పిడుగురాళ్ళ - క్రోసూరు రహదారిలో దొడ్లేరు గ్రామంలో రైతులు రాస్తారోకో నిర్వహించి రాకపోకలు స్తంభింపచేశారు. నీరు లేక పంటలు ఎండి పోతున్నా కెనాల్స్ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా స్పందించడం లేదన్నారు. 20 రోజుల నుంచి మాగాణి పంటలు ఎండి పోతున్నాయన్నారు. ఎండిన వరి కంకులను చూపుతూ వందలాది మంది రైతులు రాస్తారోకోలో పాల్గొన్నారు. బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చింతపల్లి మేజరుకు 500 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి వుండగా 300 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారన్నారు. ఈ నెలాఖరు వరకు నీరు వదిలితే గాని తాము పంటలను కాపాడుకోలేమని వారు తెలిపారు. నీటి విడుదలపై హామీ లభించేదాక రాస్తారోకో విరమించేది లేదని భీష్మించారు. ఈ క్రమంలో ప్రధాన రహదారిలో రాకపోకలు స్తంభించాయి. అధికారుల నిర్లక్ష్యం వలనే నీరు సక్రమంగా సరఫరా కావటం లేదని రైతు సంఘం నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రవీణ్ స్పందించి సాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఆర్డీవో మురళీకృష్ణ


భూమిపూజ నిర్వహిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

గురజాలటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గురజాల నగర పంచాయతీ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని జీఎస్సీ కాలనీ సమీపంలో అమృత్ 2.వో పథకం కింద ఐదు లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడతూ అమృత్ పథకం కింద రూ.8.58 కోట్లు మంజూరయ్యాయన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో కూడా వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేయాల్సి ఉందన్నారు. యేడాది కల్లా వీటి నిర్మాణం పూర్తవుతందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నగేష్, మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు, కౌన్సిలర్లు నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీను, కొట్టె శ్రీను, చింతకాయల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ద్రోహి జగన్

● పెద్దలకు దోచిపెట్టేందుకే జగనన్న ఇళ్ల స్థలాలు
● లిడ్‌క్యాప్ చైర్మన్ మాణిక్యరావు


విలేకరులతో మాట్లాడుతున్న మాణిక్యరావు

దుర్గి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దళితుల ద్రోహి, కులాలు, వర్గాల మధ్య చిచ్చుపెట్టే క్రూరుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. మండలంలోని అడిగొప్పుల శివారులో లెదర్‌పార్కును బుధవారం ఆయన సందర్శించి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో అప్పటి మంత్రి కోడెల శివప్రసాదరావు లెదర్‌పార్కు ఏర్పాటుకు 33 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. ఈ భూమిలో 19 ఎకరాలు జగనన్న ఇళ్లస్థలాలకు కేటాయించడమేంటని ప్రశ్నించారు. వైసీపీలోని పెద్దలకు అప్పగించేందుకే ఇలా కేటాయించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లెదర్‌పార్కులను పునరుద్ధరించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు, కన్వీనర్ పేరుపోగు రామయ్య, జనసేన గుంటూరు నగర అధ్యక్షుడు కొండూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం, అభివృద్ధి
కూటమి ప్రభుత్వానికే సాధ్యం

బెల్లంకొండ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. బుధవారం బెల్లంకొండలో బీసీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన వెంటనే ఆదరణ-3 పథకానికి బడ్జెట్‌లో రూ.వెయ్యికోట్లను కేటాయించిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం రూ.47కోట్లను కేటాయించిందన్నారు. ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలుచేస్తున్న ఘనత చంద్రబాబు నాయుడుదేనన్నారు. బీసీల రక్షణ చట్టాన్ని సక్రమంగా అమలుచేయటానికి తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపు

క్రోసూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): క్రోసూరు-1 సచివాలయంలో గురువారం నుంచి ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వరకు క్యాంపు కొనసాగుతుందని, ఆధార్ అప్‌డేట్ చేసుకొనేవారు సచివాలయానికి వెళ్ళి చేసుకోవచ్చన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్డుల్లో తప్పులు, చిరునామాలో మార్పులు తగిన ఆధారాలతో అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపారు.

దళిత పక్షపాతి చంద్రబాబునాయుడు

క్రోసూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ సమావేశంలో తీర్మానం ఆమోదింపచేసిన సీఎం చంద్రబాబు దళిత పక్షపాతి అని మరోసారి రుజువైనట్టు ఎమ్మార్పీఎస్, టీడీపీ ఎస్సీ నాయకులు జడ సుబ్బుమాదిగ బుధవారం అన్నారు. పెరికపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు వర్గీకరణపై చంద్రబాబు నిజాయితీని నిరూపించుకున్నారన్నారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు మందా రాజు, సిద్దెల దిలీప్‌కుమార్, ఇజ్రాయేలు, రామారావు, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 29.97 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రోపై వాహనదారులకు అవగాహన

పెదకూరపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ తీసుకుంటే ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని, డ్రగ్స్ వాడవద్దని ఎస్ఐ గిరిబాబు అన్నారు. పెదకూరపాడులో బుధవారం రాత్రి పల్నాడు పోలీసు శాఖ ముద్రించిన డ్రగ్స్ వద్దు బ్రో స్టిక్కర్స్‌ను ఆర్టీసీ బస్సులు, ఆటోలపై అంటించి వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ, ఏఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

రాజుపాలెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం జడ్పీ హైస్కూల్లోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది. బుధవారం జరిగిన హిందీ పరీక్షకు మండలంలో మొత్తం 429మందికి 424మంది విద్యార్థులు హాజరయ్యారు.

అదనపు లోడు వినియోగదారులు నగదు చెల్లించాలి

● విద్యుత్ శాఖ ఈఈ నూతలపాటి సింగయ్య

మాచర్లటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదనపు లోడు వినియోగదారులు నగదు చెల్లించాలని విద్యుత్ శాఖ ఈఈ నూతలపాటి సింగయ్య అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వినియోగదారులు నూతనంగా మీటరు తీసుకునే సమయంలో 1 కిలోవాట్స్ చెప్పి తదుపరి అదనంగా వినియోగిస్తున్నారన్నారు. వినియోగదారులు స్వచ్ఛందంగా అదనపు లోడుకు 50 శాతం రాయితీతో నగదు చెల్లించాలని సూచించారు. జూన్ నెలాఖరు వరకు ఈ అవకాశం ఉందన్నారు. రైతులు విద్యుత్ బకాయిలను చెల్లించాలన్నారు. మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాల పరిధిలో రూ. 4,44,11,550 బకాయిలు ఉన్నట్లు చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు.

బోదిలవీడు విద్యార్థికి గేట్-25లో
ఆల్ ఇండియా 121వ ర్యాంక్

● కేరళ ట్రిబుల్ ఐటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న జయప్రకాశ్ నారాయణ


సాధనాల జయప్రకాష్ నారాయణ

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం బోదిలవీడు గ్రామానికి చెందిన సాధనాల జయప్రకాష్ నారాయణ ఈ ఏడాది నిర్వహించిన గేట్ పరీక్షల్లో ఆల్ ఇండియా 121వ ర్యాంకు సాధించారు. ఆయనకు గేట్‌స్కోరు 780 వచ్చింది. జయప్రకాష్ నారాయణ పదో తరగతిలో 10 సీజీపీఏ, ఇంటర్‌లో 96శాతం సాధించారు. కేరళ రాష్ట్రంలోని కొట్టాయం ట్రిబుల్ ఐటీలో బీటెక్ కంప్యూటర్స్‌లో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఎటువంటి శిక్షణ తీసుకోకుండానే గేట్‌లో 121వ ర్యాంకు సాధించాడు.

సారా రహిత సమాజమే లక్ష్యం

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ

మాచర్లటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో సారా రహిత సమాజమే లక్ష్యంగా నవోదయ 2వో చేపడుతున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె మణికంఠ అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో పర్యటిస్తూ నాటుసారా వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామన్నారు. బెల్లం వ్యాపారులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. వ్యాపారులపై నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. మద్యం అధిక ధరకు విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చర్యల తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట మాచర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఎండీ షరీఫ్ తదితరులు ఉన్నారు.

నాచుతో మూసుకుపోయిన గరికపాడు కాలువ

● పట్టించుకోని కెనాల్స్ అధికారులు
● సాగునీరు అందక ఇబ్బంది పడుతున్న రైతులు


నాచుతో నిండి ఉన్న గెరికపాడు కాలువ

బెల్లంకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గరికపాడు కాలువలో నాచు బాగా పెరిగి పోవటంతో సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజుల క్రితం బెల్లంకొండ సమీపంలో గల గరికపాడు చప్టాలో నాచు చప్టా లోపలకు వెళ్ళి మూసుకుపోవటంతో నీరు సరఫరా కావడం లేదు. ఈ విషయాన్ని స్థానిక కెనాల్స్ అధికారులకు రైతులు చెప్పినా ఫలితం లేకపోయింది. నాలుగు రోజులుగా నీరు రాక పోవటంతో మిర్చిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కెనాల్స్ అధికారులు స్పందించి గరికపాడు చప్టాలో ఉన్న నాచును తొలగించి రైతులకు నీరు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

డిజిటల్ గేట్లను ప్రారంభించిన డీఎస్పీ


డ్రగ్స్ వద్దు.. బోర్డులను ప్రదర్శిస్తున్న పోలీసులు

సత్తెనపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం డీఎస్పీ హనుమంతరావు డిజిటల్ గేట్లను ప్రారంభించారు. ఈ గేట్లు సన్‌రైజ్ ద్వారా ఛార్జ్ అయి 58నుంచి 68 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. అనంతరం డీఎస్పీ కార్యాలయ ఆవరణలో డ్రగ్స్ వద్దు అంటూ ఫ్లెక్సీలను డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, సిబ్బంది ప్రదర్శించారు.

21న సత్తెనపల్లిలో జాబ్‌మేళా

సత్తెనపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు బుధవారం విలేకరులకు తెలిపారు. నియోజకవర్గంలోని యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ పూర్తిచేసిన వారు హాజరు కావచ్చన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 80743 93466, 94949 86164 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

22 లోగా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేయాలి

నకరికల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీ లోగా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జీ కాశయ్య కోరారు. కాపులకు 14 యూనిట్లు, బీసీలకు 38 యూనిట్లు, కమ్మకు నాలుగు, రెడ్లకు రెండు, బ్రాహ్మణులకు ఒకటి, వైశ్యులకు ఒకటి, ఈబీసీలకు ఒకటి కేటాయించినట్లు వివరించారు. 50శాతం సబ్సిడీపై రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

సబ్సిడీపై ఉచిత కుట్టుమిషన్‌లు.. శిక్షణ

మండలంలో కుట్టు శిక్షణ ఇచ్చి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు కుట్టుమిషన్‌లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. దరఖాస్తు దారులంతా ఏపీవోబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈనెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు తమ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జతచేయాల్సి ఉంటుందని, వయస్సు 21 సంవత్సరాల నుంచి 50 మధ్యలో ఉండాలన్నారు.

వరి అగ్గి తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి

నకరికల్లు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వరిలో అగ్గితెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవో దేవదాసు కోరారు. బుధవారం రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వరిలో అగ్గితెగులును గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు.

బాలిక మిస్సింగ్‌పై ఫిర్యాదు

సత్తెనపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాల చిన్నారి మిస్సింగ్‌పై కేసు నమోదైంది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను, తన భర్త బాలస్వామి పనుల నిమిత్తం వైజాగ్ వెళ్తూ తమ మూడేళ్ల కుమార్తెను తోడికోడలు ముత్యాలు, మరిది మురళీల వద్ద వదిలి వెళ్ళినట్టు పట్టణంలోని 31వ వార్డుకు చెందిన పల్లపు అంజలి పేర్కొంది. పది రోజుల క్రితం తమ పాపను ఫోన్‌లో మాట్లాడించాలని తోడికోడలు ముత్యాలుకు ఫోన్‌చేసి అడగ్గా పాప ఆచూకీ తమకు తెలియదని సమాచారం ఇచ్చిందన్నారు. వెంటనే తాను, తన భర్త సత్తెనపల్లి వచ్చి విచారించినా ప్రయోజనం లేదన్నారు. తమ తోడికోడలు, మరిదిపై విచారణ జరిపి తమ కుమార్తె ఆచూకీ తెలపాలని ఆమె పోలీసులను కోరింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన


తాలూకా సెంటర్‌లో పోలీసులు నిర్వహించిన ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

సత్తెనపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మహిళా భద్రత కోసం ప్రభుత్వం శక్తియాప్‌ను తెచ్చిందని పట్టణ సీఐ బ్రహ్మయ్య అన్నారు. మహిళా భద్రతే ప్రధానాంశంగా వచ్చిన ఈ యాప్‌పై బుధవారం తాలూకా సెంటర్‌లో పోలీసులు, విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. మహిళా శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ క్షణాల వ్యవధిలో ఆపదలో ఉన్నవారి వద్దకు పోలీసులు చేరుకొనేలా ఇది పని చేస్తుందన్నారు. చిన్నారులపై అకృత్యాలు, ఈవ్‌టీజింగ్ వంటి వాటిపై సమాచారం అందగానే శక్తిటీమ్ వెళ్ళి బాధితులను రక్షిస్తుందన్నారు. త్వరలో ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ పెడతామన్నారు. ఈ కోడ్ స్కాన్ చేయగానే అందులో ప్రయాణిస్తున్న వారికి వివరాలు తెలుస్తాయన్నారు. ఇతరులు ఆదపలో ఉంటే వారు క్యూర్ కోడ్ స్కాన్ చేసి సమాచారం తెలియజేస్తే వెంటనే పోలీసులను పంపిస్తారన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సంధ్యారాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. పలువురికి గాయాలు

రాజుపాలెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు-మాచర్ల రహదారిపై మండలంలోని రాజుపాలెం, రెడ్డిగూడెం గ్రామాల మధ్య బుధవారం రోడ్డు ప్రమాదం జరిగి పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మొగులూరుకు చెందిన షేక్‌లాల్ అహ్మద్, కూను శ్రీనివాసరావులు కారులో పిడుగురాళ్ల వెళ్తున్నారు. మార్గంమధ్యంలోని రాజుపాలెం సమీపంలోకి వచ్చేసరికి హైదారాబాద్ నుండి ముపాళ్ళ మండలం మాదల వెళ్తున్న వడ్లమూడి కాజాబాబు కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో కార్లలోని వారందరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎస్సై వేణుగోపాల్ 108లో సత్తెనపల్లి ఆసుపత్రికి తరలించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

28 వరకు ఆధార్ క్యాంప్‌లు

వినుకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఆయా సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు, 25నుంచి 28వ తేదీ వరకు మునిసిపల్ కాంపౌండ్‌లోని లాయర్ స్ట్రీట్ 1 సచివాలయంలో, ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆధార్ క్యాంప్‌లు ఉంటాయన్నారు. నూతన ఆధార్‌కార్డులు, బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్ కార్డు డౌన్‌లోడ్, కలర్ ప్రింట్ మొదలైన సేవలు ఉంటాయని తెలిపారు.

బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, మార్చి 19, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పెద్ద చెరువు 13వ లైన్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో బుధవారం పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి కే మధుస్వామి పోక్సో చట్టంపై క్షుణ్ణంగా వివరించారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధి విధానాలు, రోజువారీ జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను వివరించారు. కార్యక్రమంలో వసతి గృహ నిర్వాహకులు, విద్యార్థినులు పాల్గొన్నారు

రైతులందరికీ విశిష్ట సంఖ్యపై అవగాహన కలిగించాలి

● ఏవో నరేంద్రబాబు

నరసరావుపేట రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ ఆధార్ పీఎం కిసాన్ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై (విశిష్ట సంఖ్య) అవగాహన కలిగించాలని మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అధ్యక్షతన గ్రామ వ్యవసాయ నాయకులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధార్ పీఎం కిసాన్ ఫార్మర్ రిజిస్ట్రేషన్, పీ4 సర్వే, కౌలు రైతులు, పంట కోత ప్రయోగం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కే బ్రహ్మయ్య, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ నాగేంద్రబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మర్రిచెట్టుపాలెం వీరాంజనేయ స్వామి తిరునాళ్ళ

రొంపిచర్ల, మార్చి 19 (ఆంధ్రజోతి): మండలంలోని మర్రిచెట్టుపాలెంలోని వీరాంజనేయస్వామి తిరునాళ్ళ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన పూజలను అర్చకులు నిర్వహించారు. ఆలయంలో రూ.5లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను చట్టు సత్యనారాయణ, సైదమ్మ దంపతులు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

పాఠశాలలను పరిశీలించిన ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్

రొంపిచర్ల, మార్చి 19 (ఆంధ్రజోతి): మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్ రాజరాజేశ్వరి బుధవారం పరిశీలించారు. ఈ నెల 10వ తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పంపిణీ తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

మాలలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించాలి: పౌలు

వినుకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటిమంది ఉన్న మాలలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పౌలు డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ కాంప్లెక్‌లోని మాల మహానాడు రాష్ట్ర కార్యాలయంలో మాల మహానాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో మాట్లాడారని, వర్గీకరణకు మాల మహానాడు వ్యతిరేకమన్నారు. సీఎం చంద్రబాబు పెద్దన్న పాత్ర పోషించాలని మాదిగలకు 5శాతం, రెల్లి వారికి 1 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ రిజర్వేషన్ ఇచ్చేంతవరకు పోరాటం చేస్తామన్నారు. 2024 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షైనర్‌బాబు, కె.కమలాకర్, కె.చంటి, వి.విజయేందర్, ఎన్.ఆదాం, ఎస్.శ్రీను పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హయాంలో పెరిగిన నేరాలు: మాజీ ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వినుకొండలో హత్యలు, చోరీలు, కిడ్నాప్ వంటి అక్రమ కార్యక్రమాలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పోలీసులు ఈ ఘటనలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి సంఘటనలు ప్రజల భద్రతకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలి: చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవచూపాలని మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని బుధవారం కోరారు. తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన చాంబర్ లో వివిధ వార్డులలోని ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారంపై ఆయన సంబంధిత అధికారులతో చర్చించారు.

ఆర్వో ప్లాంట్‌లున్నా.. తాగునీటికి ఇబ్బందే..!

● చిన్న చిన్న సమస్యలతోనే నిలిచిపోతున్న ప్లాంటులు

● నీరు కొనుగోలు చేసి అందిస్తున్న ఉపాధ్యాయులు





దొండపాడు ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్, చాట్రగడ్డపాడులో కనెక్షన్ ఇవ్వని వాటర్ ఫిల్టర్

వినుకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామని గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం శూన్యంగా ఉన్నాయి. వినుకొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు కింద పాఠశాలల పునరుద్ధరణ కార్యక్రమానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటి విడత కార్యక్రమంలో భాగంగా 33 పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం, నూతన బల్లలు, ఎల్‌ఈడీ టీవీల ఏర్పాటుతో పాటు ఆర్వో పాంట్లు ఏర్పాటుచేశారు. పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌లు పూర్తిస్థాయిలో పనిచేయకపోవటంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైతే వాటిని కనీసం మరమ్మతులు చేపట్టే పరిస్థితి కూడా నేటికి కరువైంది. ఆర్వో ప్లాంట్‌కు అవసరమైన చిన్న స్క్రూ సైతం ప్లాంట్ నిర్వాహకుడు వచ్చి ఏర్పాటుచేస్తే తప్ప బయట దొరకని పరిస్థితి. కనీసం గ్యారెంటీ లేకపోవడం, గత ప్రభుత్వంలో ఎస్‌ఎంఎస్ ఫండ్స్ విడుదల కాకపోవడంతో ఆర్వో ప్లాంట్‌లన్నీ నేడు నిరుపయోగంగా మారాయి. స్కూల్ గ్రాంట్‌తో అయినా మరమ్మతులు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులు పూనుకున్నప్పటికీ ఆర్వోప్లాంట్ విడి పరికరాలు బయట దొరకని పరిస్థితి. దీంతో ప్లాంట్‌ను పాఠశాలకు పంపిణీచేసిన గుత్తేదారుడు వస్తే తప్ప వాటి మనుగడ కొనసాగలేని పరిస్థితి. మండలంలోని ఉప్పరపాలెం, చాట్రగడ్డపాడు, దొండపాడు గ్రామాల్లోని పాఠశాలలతో పాటు పలు పాఠశాలల్లో ఆర్వోప్లాంట్‌లు నిరుపయోగంగా మారాయి. చాట్రగడ్డపాడులో 40మంది విద్యార్థులకు సరిపోయేవిధంగా పాఠశాల బిల్డింగ్‌పై ట్యాంక్‌ను ఏర్పాటుచేసి తరగతి గదిలో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసేశారే తప్ప నీటి సరఫరాకు కనెక్షన్ ఇవ్వకుండా వదిలివేశారు. దీంతో కనీసం విద్యార్థులు నీరు తాగాలన్నా ఇబ్బందికర పరిస్థితులు పాఠశాలలో నెలకొని ఉన్నాయి. ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో గ్రామంలోని ఆర్వో ప్లాంట్ వద్ద నుంచి నీటిని తెప్పించుకొని నిత్యం విద్యార్థులకు అందచేయాల్సిన పరిస్థితి నెలకొని ఉంది.

గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌లకు అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేపట్టి ఈ వేసవి కాలంలో విద్యార్థులకు తాగునీరు అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హిందీ పరీక్షకు 99 శాతం మంది విద్యార్థులు హాజరు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, పక్కన డీఈవో ఎల్ చంద్రకళ తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి రెగ్యులర్ పరీక్షలు 128 కేంద్రాలలో బుధవారం ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి. రెండో రోజు జరిగిన హిందీ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 25,607 మంది విద్యార్థులకు 25,373 మంది విద్యార్థులు (99 శాతం) హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 78మంది హాజరయ్యారు. 128 పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 22సిట్టింగ్ స్క్వాడ్‌లు, 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. సార్వత్రిక విద్యాపీఠం పదో తరగతి పరీక్షలు మార్చి 2025కు జిల్లా వ్యాప్తంగా రెండో రోజు ఇంగ్లీషు పరీక్షకు 1118మంది విద్యార్థులకు 977మంది విద్యార్థులు 87 శాతం హాజరయ్యారు. 27పరీక్షా కేంద్రాలను పరిశీలించడానికి 14సిట్టింగ్, 13ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు నకరికల్లు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి సత్తెనపల్లి డివిజన్‌లోని ఆరు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం డైరెక్టర్ ఆర్.నరసింహరావు నరసరావుపేట పట్టణంలో ఐదు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. డిస్ట్రిక్ట్ లెవెల్ అబ్జర్వర్ జాయింట్ డైరెక్టర్ ఎన్ గీత వినుకొండ పట్టణంలోని 11 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. డీఈవో ఎల్ చంద్రకళ నకరికల్లు, కారంపూడి మండలాలలోని 4 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం స్టేట్ కో-ఆర్డినేటర్ ఎన్ అక్బర్ అలీ గురుజాలలోని రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ తెలిపారు.

ఉప విద్యా శాఖ అధికారి తనిఖీ

రొంపిచర్ల, మార్చి 19 (ఆంధ్రజోతి) : మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెంలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాలను సత్తెనపల్లి ఉప విద్యా శాఖ అధికారి ఏసుబాబు బుధవారం తనిఖీ చేశారు. రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో ఒకరు, రెడ్డిపాలెంలో ఏపీ మోడల్ పాఠశాలలో ముగ్గురు, రెడ్డిపాలెంలోని జడ్పీ పాఠశాలలో ఇద్దరు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

విత్తన గుళికల తయారీతో మొక్కలకు వ్యాధి నిరోధక శక్తి

ప్రాజెక్టు మేనేజరు అమలకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం కె.అమలకుమారి, పక్కన ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

నరసరావుపేట రూరల్, మార్చి 19: (ఆంధ్రజ్యోతి): విత్తన గుళికల తయారీతో మొక్కలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ప్రాజెక్టు మేనేజరు కె.అమలకుమారి తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చివరి రోజు పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి పాల్గొని మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులలో కూడా రైతులు భూమిని కప్పి ఉంచే విధానంలో భాగంగా విత్తన గుళికల విధానంపై సిబ్బందికి అవగాహన కలిగించారు. వేసవికాలంలో ప్రతి రైతు తనకున్న మొత్తం పొలంలో ఈ విత్తన గుళికల విధానం ఆచరించడం ద్వారా భూమిలో ఉన్న తేమ శాతం, కార్బన్ శాతం ఆవిరి కాకుండా ఉంటుందన్నారు. భూమిలో కర్బనశాతం పెరగటం వలన తర్వాత వేయబోయే ప్రధాన పంటకు చీడపీడల ఉధృతి తగ్గుతుందని మొక్కకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా రైతులకు రసాయనిక ఎరువులకు అయ్యే ఖర్చు పూర్తిగా తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ విత్తన గుళికల తయారీ విధానానికి కావలసిన పదార్థాలు బీజామృతం, బంక మట్టి, ఘనజీవామృతం, బూడిద విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధిచేసి ముందుగా బంక మట్టి తో విత్తనాన్ని కలిపి, తర్వాత ఘనజీవామృతం, చివరిగా బూడిదతో కలపాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఎన్ఎఫ్ఏలు మన్విష లక్ష్మి జిల్లా శిక్షకుడు సైదయ్య ఎన్ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, జిల్లా ట్రైనర్స్ జయలక్ష్మి, బాజీ బాబు, శివలక్ష్మి, తిరుపతిరావు, మధుబాబు, బేబీ రాణి, వినోద, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ పుటేజీల ఆధారంగా వృద్ధురాలి హత్య కేసు దర్యాప్తు

వినుకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన కొత్తపేటలో ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధురాలు కొప్పరపు సావిత్రి ఒంటిపై బంగారం అపహరించి హత్య చేసిన వారికోసం పోలీసులు వేట ప్రారంభించారు. కేసును చేధించేందుకు కొత్తపేట వీధుల్లోని సీసీ కెమెరాల ఆధారంగా ఇప్పటికే కొంతమంది అనుమానితులను అదుపులో తీసుకొని విచారించారు. దీంతో కేసు కొంతమేర పురగతి సాధించినట్లు సమాచారం. ఫింగర్ ప్రింట్స్ బృందం వద్ద ఉన్న పాత నేరస్తుల వివరాలను ఇప్పటికే తెప్పించుకొని పరిశీలిస్తున్నారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా అనుమానితులను గుర్తించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంపై పట్టణ సీఐ శోభన్‌బాబును వివరణ కోరగా మరో రెండు రోజుల్లో హత్యకు కారకులైన దోషులను అదుపులోకితీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఘనంగా తిరుమల దేవుని తిరునాళ్ళ

ఈపూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్నిగుండాల సమీపంలోని తిరుమల దేవుని తిరునాళ్ళ బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పొంగళ్ళు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. దేవదాయ శాఖ అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడంతో భక్తులు ఎండలోనే పొంగళ్ళు పెట్టాల్సి వచ్చింది. దీనిపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీకి విఫలయత్నం

యడ్లపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి యత్నించిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో బుధవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోపూరి సాంబయ్య గ్రామంలోని ఎన్టీఆర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో నివాసం ఉంటున్నాడు. సాంబయ్య ఇద్దరు పిల్లలు ఎన్ఆర్ఐలు. గతంలో సాంబయ్య కుమార్తె హైదరాబాద్‌లో ఇల్లు కొనుక్కుని అక్కడే ఉండేది. కొంత కాలం సాంబయ్య దంపతులు కూతురివద్ద ఉన్నారు. ఆ సమయంలో దొంగలు యడ్లపాడులోని ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని స్థిరాస్తి డాక్యుమెంట్లు, కొద్ది మొత్తంలో బంగారం, నగదు తీసుకెళ్ళారు. తర్వాత మరో రెండుసార్లు చోరీ యత్నాలు జరగడంతో ఏడాదిన్నర క్రిందట ఇంటికి సీసీ కెమెరాలు కూడా అమర్చాడు. తాజాగా దుండగులు మంగళవారం రాత్రి సుమారు 1.45 గంటల సమయంలో ఇంటి ఆవరణలోకి ముసుగుతో ధరించి ప్రవేశించి ఇంటిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే ప్రధానద్వారానికి అమర్చిన తాళం రాకపోవడంతో వెనుతిరిగారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు: సీఐ

ఈపూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల లైసెన్స్‌దారులు నిబంధనలు తప్పక పాటించాలని లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ డీ వెంకటేశ్వర్లు అన్నారు. స్టేషన్ పరిధిలోని రొంపిచర్లలో బుధవారం మద్యం షాపులను తనిఖీచేశారు. నీలకంఠేశ్వర, త్రికోటేశ్వర మద్యం షాపులలో మద్యంను పరిశీలించారు. ఆ షాపులలోని మద్యం సీసాలను రసాయనిక పరీక్షలకు మద్యం సీసాలను సేకరించారు. తనిఖీలలో ఎస్ఐ కే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వెదురు పెంపకంతో రైతులకు లాభాలు

● ఉద్యాన శాఖ కమిషనరేట్ జేడీ హెచ్ దేవమునిరెడ్డి

నూజెండ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వెదురు తోటలు పెంపకం రైతులకు లాభసాటిగా ఉంటుందని ఉద్యాన శాఖ కమిషనరేట్ జేడీహెచ్ దేవమునిరెడ్డి అన్నారు. నేషనల్ బ్యాంబో మిషన్ పథకం అమల్లో భాగంగా మండలంలోని రవ్వవరం గ్రామంలోని వెదురు సాగు చేస్తున్న పంట పొలాల్లో రైతులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవమునిరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో వెదురు ఉత్పత్తులతో గృహ నిర్మాణం, పరిశ్రమల్లో కలపగా, అలంకరణ వస్తువులు, నిత్యావసర వస్తువులు తయారు చేసే పరిశ్రమలు రానున్నాయన్నారు. అదే విధంగా మేలైన మొక్కలు ఎంపిక, సాగు పద్ధతులను అభ్యుదయ రైతు సత్తెనపల్లికి చెందిన వీ వెంకటేశ్వర్లు రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి వీ రమణారెడ్డి, ఉద్యానవన అధికారులు ఎస్‌కే నబీ రసూల్, డీ నవీన్ కుమార్, విశాల్, సురేష్ కుమార్, శ్రీనిత్య, మండల వ్యవసాయ అధికారిణి ఎస్‌కే సుగుణా బేగం, గ్రామ విలేజ్ అగ్రికల్చరల్, హార్టికల్చర్ అసిస్టెంట్‌లు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మీసాల మురళీకృష్ణ యాదవ్

నూజెండ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యాదవ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం తలార్లపల్లి చెందిన మీసాల మురళికృష్ణయాదవ్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. మీసాల మురళీకృష్ణయాదవ్ గతంలో నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం చేసేందుకు, టీడీపీ సభ్యత్వాల నమోదు, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేశారు.

రోటరీ ఉచిత ఆరోగ్య కేంద్రానికి రూ.12 వేలు విరాళం

చిలకలూరిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి రోటరీ ఉచిత ఆరోగ్య కేంద్రానికి రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కారుమంచి శివరావు బుధవారం రూ.12వేల నగదును మందుల కొనుగోలు నిమిత్తం విరాళంగా ఇచ్చారు. క్లబ్ అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి, డాక్టర్ కె.రంగారావు, కార్యదర్శి యు.ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రభుత్వం సాయం చేయాలి: గుమ్మడి

శావల్యాపురం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కరువై పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గుమ్మడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళాకారులు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రబాబును మంగళవారం కలసి వినతి పత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాకారులకు ప్రభుత్వం ప్రతి మండలంలో కాలనీలు ఏర్పాటుచేసి నివేశన స్థలాలను ఇవ్వాలని, సాంస్కృతిక విభాగం నుంచి వచ్చే నిధులు కళాకారులకు కేటాయించాలని, దేవాలయాల్లో కళాకారులకు జీవనోపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

22 నుంచి కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఈపూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు ఈపూరు కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి బుధవారం తెలిపారు. అదేవిధంగా 7,8,9,10 తరగతులలో ఖాళీలకు కూడా భర్తీ చేస్తామన్నారు. కేజీబీవీలో చేరేందుకు అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్‌పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

చిలకలూరిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాస్తూ పరీక్ష హాలులో తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినిని టౌన్ ఎస్ఐ శివరామకృష్ణ సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించి మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని చైతన్య హైస్కూల్‌లో ఒక విద్యార్థిని పరీక్ష రాస్తుండగా జ్వరంతో తీవ్ర అనారోగ్యానికి గురయింది. బాలిక ఇబ్బందిని గమనించిన ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణం స్పందించిన చిలకలూరిపేట అర్బన్ ఎస్ఐ శివరామకృష్ణ ఆ విద్యార్థినిని సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లి అత్యవసర వైద్యసేవలు అందించారు. బాలిక కోలుకున్న అనంతరం తిరిగి పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చి పరీక్ష రాయించారు.

శనగల కొనుగోళ్లు ప్రారంభం

చిలకలూరిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల పరిధిలో బుధవారం నుంచి శనగల కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా శనగ అమ్ముకోదలచిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యసాయాధికారి శ్రీమతి టి.శ్రీలత తెలిపారు. రబీ 2024-25 సంవత్సరంలో శనగపంట వేసిన రైతుల వివరాలను ఈ-పంట ద్వారా నమోదు చేయటం జరిగిందని చెప్పారు. శనగ మద్దతు ధర రూ.5,650తో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట జీడీసీఎంఎస్ ద్వారా కొనుగోలు జరుగుతుందని తెలిపారు. కందులు కూడా రూ.7,550 ధరతో కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట జీడీసీఎంఎస్ ఇన్‌చార్జి కె అనిల్, ఏయివో జీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు క్రీడాప్రాంగణంలో నిలిచిన అభివృద్ధి పనులు ప్రారంభించాలి

● శాప్ చైర్మన్‌కు డాక్టర్ కోడెల శివరామకృష్ణ వినతి



శాప్ చైర్మన్ రవి నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న కోడెల శివరామకృష్ణ

నరసరావుపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడాప్రాంగణంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు ప్రారంభించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ కోరారు. బుధవారం విజయవాడలోని శాప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాథమిక సంస్థ చైర్మన్ అనిమిని రవి నాయుడుకు కోడెల శివరామకృష్ణ వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ ఆగిపోయిన స్విమ్మింగ్ పూల్, సింథటిక్ టెన్నిస్ కోర్టులు, వాకింగ్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ హాస్టల్ పనులు, అన్నింటిని మించి స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆలోచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులకు సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మందాడి రవి, కొక్కిరాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తలూరులో సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో మధులత

రైతుల సమక్షంలోనే హద్దులను నిర్ణయించాలి

● నరసరావుపేట ఆర్డీవో మధులత

కొత్తలూరు (శావల్యాపురం) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే పనులను రైతుల సమక్షంలోనే నిర్వహించాలని, వారి అంగీకారంతోనే సర్వే సిబ్బంది భూ హద్దులను నిర్ణయించాలని నరసరావుపేట ఆర్డీవో మధులత అన్నారు. మండలంలోని కొత్తలూరులో జరుగుతున్న రీ సర్వే పనులను బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వే రికార్డులు, సమస్యలు, పురోగతిని పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ రీ సర్వే చేసే ప్రాంతంలోని రైతులకు సర్వే సిబ్బంది ముందుగా నోటీసులు ఇచ్చి వారు వచ్చిన తర్వాతే పొలాల హద్దులను నిర్ధారించాలన్నారు. భూమి కొలిచిన తర్వాత రైతులకు తెలియజేసి, అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. కొత్తలూరు రెవెన్యూ పరిధిలో 4412 ఎకరాలు రీ సర్వే చేయాల్సి ఉండగా ప్రస్తుతం 2205 ఎకరాలు పూర్తయిందన్నారు. పల్నాడు జిల్లాలో 25 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పనులు చురుగ్గా జరుగుతున్నాయని, వినుకొండ నియోజకవర్గంలో ఐదు గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. రీ సర్వేకు రైతులంతా తమవంతు సహకరించాలని, సర్వే సమయంలో సిబ్బందికి అందుబాటులో ఉండి భూముల వివరాలు, పత్రాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సబావత్ సురేష్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాసరయ్య, మండల సర్వేయర్ రాజు, ఇన్‌చార్జి ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వో మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎన్ఎం సుమలత మృతి



సుమలత (ఫైల్‌ఫొటో)

ఈపూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆర్.సుమలత (57) బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. సుమలత అంగలూరు, వనికుంట, గుండేపల్లి గ్రామాలలో సుమారు 17సంవత్సరాలు ఏఎన్ఎంగా పని చేశారు. సుమలతకు భర్త, ఇద్దరు కుమార్తెలు. సుమలత మృతికి కొచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సిరి వెన్నెల, ఎంపీహెచ్ఎస్ కే సాంబశివరావు, పీహెచ్ఎన్ టీ లక్ష్మీ నర్సమ్మ, సిబ్బంది నివాళులర్పించారు.

చీఫ్‌విప్ జీవీ సంతాపం

వినుకొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో నివాసం ఉంటున్న రాయబారం సుమలత కుటుంబ సభ్యులను ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఫోన్‌లో పరామర్శించి, సంతాపం తెలియజేశారు. పట్టణంలోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి స్త్రీల సమాజం ప్రెసిడెంట్‌గా కూడా సుమలత బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

30 మందికి సంతాన సాఫల్య వైద్యసేవలు

చిలకలూరిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కందిమళ్ళ స్పెషాలిటీ ఆసుపత్రిలో మూడు రోజులపాటు జరిగే ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరంలో బుధవారం తొలి రోజున 30మంది దంపతులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు చేశారు. డాక్టర్ కందిమళ్ళ తేజశ్వి, డాక్టర్ శ్రీహర్ష ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు. సంతానం లేని దంపతులు ఈ శిబిరానికి హాజరై ఉచిత వైద్యసేవలు పొందవచ్చునని వారు తెలిపారు.

పాల రైతులకు సంగం డెయిరీ చేయూత

● సంగండెయిరీ మేనేజర్ మక్కెన జానకిరామయ్య

శావల్యాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన పాల ఉత్పత్తిదారుల కుటుంబాలను ఆదుకొనేందుకు సంగం డెయిరీ ఆర్థికసాయాన్ని అందించి వారికి ఎంతో తోడ్పాటు అందిస్తోందని వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ మక్కెన జానకిరామయ్య అన్నారు. మండలంలోని కారుమంచికి చెందిన సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారుడు బొల్లేపల్లి రాఘవులు, కనమర్లపూడికి చెందిన సంగం డెయిరీ ఎంపీఐ అధ్యక్షుడు మర్రి రాములు ఇటీవల మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులకు సంగం డెయిరీ అధికారులు బుధవారం ఆర్థికసాయాన్ని అందించారు. వెల్ఫేర్ స్కీం ద్వారా మట్టి ఖర్చులకు రూ.10వేలు, ప్రమాద బీమా చెక్కు రూ.40వేలను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో వినుకొండ సంగం డెయిరీ డైరెక్టర్ ఆంజనేయులు, సెంటర్ల అధ్యక్షుడు శాకమూరి శంకర్‌రావు, మర్రి శ్రీనివాసరావు, సెక్రటరీలు అడుసుమల్లి లక్ష్మీనారాయణ. మర్రి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎన్ కళాశాలలో వైద్య శిబిరం

చిలకలూరిపేట,మార్చి19 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్ఎన్ఎస్ సీవీఎస్ కళాశాలలో తలసేమియా డేకేర్, విష్ణు డెంటల్ కేర్ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం, రక్తదాన శిబిరం బుధవారం నిర్వహించారు. 120మందికి పైగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత, వైస్ ప్రిన్సిపాల్ పి.ఉదయ ప్రకాష్, విష్ణు డెంటల్ క్లినిక్ అధినేత డాక్టర్ బి.రాజశేఖర్, తలసేమియా డే కేర్ అధినేత బిసాంబిరెడ్డి పాల్గొన్నారు.